సాక్షి ఆదిలాబాద్

శనివారం ॥ 14 ॥ డిసెంబర్ ॥ 2024



క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ!

స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరగడంతో డిజిటల్ లావాదేవీలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో సైబర్ మోసాలు సైతం పెరుగుతున్నాయి.

8లో▸



జాతీయ స్థాయిలో రాణించాలి

క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తలమడుగు మండలం ఖోడద్ జెడ్పీ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో పోటీలను ప్రారంభించారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
25.0/09.0

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రివేళలో చలి ప్రభావం అధికం కానుంది.

న్యూస్‌రీల్

నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ రాజర్షి షా



వండిన అన్నం రుచి చూస్తున్న కలెక్టర్

బోథ్: వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వంటగదిలో సామగ్రితో పాటు వండిన వంటలను పరిశీలించారు. స్వయంగా అన్నం రుచి చూశారు. వంట చేసేటప్పుడు, విద్యార్థులకు భోజనం వడ్డించే క్రమంలో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతీ ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన అమలు తీరును ఆహార భద్రత కమిటీ ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్ వంట ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్ సుభాష్ చందర్, ప్రత్యేకాధికారి మహ్మద్ వాజీద్, ప్రధానోపాధ్యాయులు శంకర్, వార్డెన్ ప్రియ, ఉపాధ్యాయులున్నారు.

'గ్రూప్-2' కోసం ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్: ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న టీజీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షల నేపథ్యంలో అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. ఆది, సోమవారాల్లో ఆదిలాబాద్ నుంచి బంగారిగూడ, పిప్పర్‌వాడలకు ఉదయం 8, సాయంత్రం 5:30 గంటలకు ప్రత్యేక బస్సులు ఉంటాయని తెలిపారు. వివరాలకు 83310 33707 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

15న బేస్‌బాల్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ నెల 15న సీఎం కప్ జిల్లా స్థాయి మహిళలు, పురుషుల బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన క్రీడాకారులు ఆదివారం ఉదయం 10 గంటలకు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో పోటీలకు హాజరు కావాలని సూచించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 18నుంచి హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

కొనసాగుతున్న 'సమగ్ర' సమ్మె



ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న నాయకులు

కైలాస్‌నగర్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న రిలే దీక్షలకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్‌తో పాటు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మూగ శ్రీనివాస్ శుక్రవారం మద్దతు తెలిపారు. సమగ్ర ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి



రికార్డులను పరిశీలిస్తున్న జేడీఏ శ్రీధర్ స్వామి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని జేడీఏ శ్రీధర్ స్వామి అన్నారు. శుక్రవారం జైనథ్ మండల కేంద్రంలోని పీఏసీఎస్, భోరజ్‌లోని అగ్రో రైతు సేవ కేంద్రంతో పాటు కూర గ్రామంలోని పొన్నుస్వామి సీడ్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆదిలాబాద్ ఏడీఏ అష్రఫ్, జైనథ్ ఏవో పూజ, తదితరులు పాల్గొన్నారు.

స్థానికంపై ఫోకస్



మంత్రి సీతక్క



మంత్రి రాక నేపథ్యంలో బోథ్‌లో నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- ఉమ్మడి జిల్లా పర్యటన మరూ చేసిన ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యం..
- 'పార్లమెంట్' ఓటమితో నారాజ్
- కొంతకాలం నియోజకవర్గాల పర్యటనకు దూరం
- అధిష్టానం సూచనతో మళ్లీ క్షేత్రస్థాయిలోకి..

సాక్షి,ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మళ్లీ నియోజకవర్గాల బాట పట్టారు. పార్లమెంట్ ఎన్నికల ఓటమితో గతంలో ఆమె కొంత నారాజ్ అయ్యారు. అప్పటి నుంచి క్షేత్రస్థాయి పర్యటనకు దూరంగా ఉన్నారు. ఓ దశలో ఇన్‌చార్జి పదవి సైతం వీడతారనే ప్రచారం పార్టీలో విస్తృతంగా సాగింది. ప్రధానంగా గెలుస్తామనుకున్న పార్లమెంట్ సీటు కోల్పోవడంతో ఆమెలో తీవ్ర నిరుత్సాహం వ్యక్తమైంది. అయితే పార్టీ అధిష్టానం తిరిగి ఆమెపైనే భరోసా ఉంచడంతో మళ్లీ క్షేత్రస్థాయి పర్యటన షురూ చేశారు. శుక్రవారం నిర్మల్ జిల్లాలో పర్యటించిన ఆమె రాత్రికి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ చేరుకున్నారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

బిజీబిజీ షెడ్యూల్..

శనివారం కూడా సీతక్క జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇంద్రవెల్లి, నేరడిగొండ, బోథ్ మండలాల్లో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆమె జిల్లాలోనే గడపనున్నారు. ఆ తర్వాత రాత్రి హైదరాబాద్ బయల్దేరి వెళ్లనున్నారు. చాలా రోజుల తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఇక్కడికి రానుండడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తుంది.

సవాలే..

ప్రధానంగా ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇక్కడ ఆదిలాబాద్, నిర్మల్, సిర్పూర్ కాగజ్‌నగర్, ముథోల్ నియోజకవర్గాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు, రెండు నియోజకవర్గాలు బోథ్, ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ప్రాతినిధ్యం వహిస్తుండగా, కాంగ్రెస్ పార్టీ ఏకైక నియోజకవర్గం ఖానాపూర్‌లో పార్టీ ఎమ్మెల్యేను కలిగి ఉంది. ఆయా నియోజకవర్గాల్లో ఆయా పార్టీల ఎమ్మెల్యేలు స్థానికసంస్థలఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకు కదులుతున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో సీతక్క పార్టీ విజయం కోసం కృషి చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇదిఒక విధంగా ఆమెకు సవాలే. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తర్వాత మళ్లీ ఈ స్థానిక సంస్థల్లో గెలుపు సాధించడం ద్వారా ఇక్కడ పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో అధిష్టానం ఉంది. ఈ పరిస్థితుల్లో సీతక్క అడుగులు ఎలా ఉంటాయోనని ఆసక్తికరం.

'స్థానిక' గెలుపు ప్రతిష్టాత్మకం..

ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమితో అప్పట్లో సీతక్క జిల్లా వైపు మొహం చాటేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు హైదరాబాద్ వెళ్లినప్పుడు ఆమెను కలుస్తూ వచ్చారు. తప్పితే ఆమె జిల్లాలో ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తి కనబర్చలేదు. ప్రధానంగా పార్లమెంట్ ఎన్నికల్లో కొంత మంది నేతలు కలిసిరాకపోవడంతోనే ఓటమి చెందామనే భావన ఆమెలో వ్యక్తమైంది. ఈ పరిస్థితుల్లో పార్టీ అధిష్టానం జోక్యం చేసుకోవడం జరిగింది. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ ఎన్నికైన తర్వాత ఇటీవల ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీని పటిష్టం చేసే విషయంలో అధిష్టానం తిరిగి సీతక్కపైనే భరోసా చూపింది. ఈ నేపథ్యంలోనే టీపీసీసీ ఉమ్మడి జిల్లా సమావేశంలో సీతక్క తిరిగి తాను జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తానని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా కృషి చేసి పార్టీని గెలిపిద్దామని ఉమ్మడి జిల్లా ముఖ్యనేతలకు పిలుపునిచ్చారు. ఆ తర్వాత మహారాష్ట్ర ఎన్నికలు రావడం, ఆమెను కేంద్ర అధిష్టానం మహారాష్ట్రలో పరిశీలకులుగా నియమించడంతో ఆ ఎన్నికల్లో ఆమె బిజీగా గడిపారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ అధిష్టానం దృష్టి పెట్టడంతో తిరిగి సీతక్క క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనకు సిద్ధమయ్యారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్..

బోథ్: మంత్రి సీతక్క పర్యటన సందర్భంగా బోథ్‌లో ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం పరిశీలించారు. నేడు పరిచయగార్డెన్‌లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అలాగే రూ.63 లక్షలతో నూతనంగా నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభిస్తారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ సుభాష్‌చందర్‌తదితరులున్నారు.

నేరడిగొండ: మంత్రి సీతక్క శనివారం నేరడిగొండలో పర్యటించనున్నారు. ఈమేరకు శుక్రవారం లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సందర్శించి పనులను పరిశీలించారు.

అంగన్‌వాడీల్లో ఖాళీలు

- జిల్లాలో 139 టీచర్, 552 ఆయా పోస్టులు వేకెన్సీ
- 23 మందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేత
- మరో 144 ఆయాలు, 27 టీచర్లకు అందించేందుకు చర్యలు
- సిబ్బంది లేక లబ్ధిదారులకు తప్పని తిప్పలు

జిల్లాలో..

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	5
మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	1,256
ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్లు	1,117
టీచర్ల ఖాళీలు	139
పనిచేస్తున్న ఆయాలు	704
ఆయా పోస్టు ఖాళీలు	552



అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకుంటున్న చిన్నారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నేళ్లుగా జిల్లాలో ఈ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. దీనికి తోడు ఇటీవల ప్రభుత్వం 65ఏళ్లు నిండిన టీచర్లు, ఆయాలు రిటైర్మెంట్ పొందారు. దీంతో మరిన్ని ఖాళీలు ఏర్పడి లబ్ధిదారులకు అవస్థలు తప్పని పరిస్థితి.

కొందరికే బెనిఫిట్..

65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం రిటైర్మెంట్ ప్రకటించింది. గత జూన్‌లోనే వీరు ఉద్యోగ విరమణ చేపట్టారు. అయితే బెనిఫిట్ రాకపోవడంతో డిసెంబర్ వరకు విధులు నిర్వర్తించారు. జిల్లాలో 50 మంది టీచర్లు ఉద్యోగ విరమణ పొందగా, 23 మందికి మాత్రమే రూ.లక్ష చొప్పున వారి అకౌంట్లలో జమ అయినట్లు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. మరో 27 మంది టీచర్లు, 144 మంది ఆయాలకు బెనిఫిట్ అందాల్సి ఉంది. పలు కారణాలతో వీరి వివరాలను అధికారులు ప్రభుత్వానికి ఆలస్యంగా పంపడంతో వారి ఖాతాల్లో డబ్బులు జమ కానట్లు తెలుస్తోంది. చాలా మంది ఉద్యోగులు వారికి బెనిఫిట్ రాకపోవడంతో ఉద్యోగ విరమణ పొందినవారు సైతం ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. అయితే వారికి మాత్రం ఎలాంటి వేతనం చెల్లించడం లేదు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలని పలుమార్లు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నప్పటికీ ప్రభుత్వం టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేలు ఇచ్చేందుకు మొగ్గుచూపింది. దీంతో ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీలు నిరాశలో ఉన్నారు.

ఏడుగురు ఆయాలకు పదోన్నతి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగ విరమణ పొందిన టీచర్ స్థానంలో ఆ కేంద్రంలో పనిచేసే ఏడుగురు ఆయాలకు ఐసీడీఎస్ అధికారులు పదోన్నతి కల్పించారు. మరికొంత మందికి ప్రమోషన్ కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ఆయాలకు ఇంటర్మీడియెట్ అర్హత చూస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారికి మేలు చేకూరనుంది.

రూ.లక్ష ఖాతాలో జమయ్యాయి



ప్రభుత్వం అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.2లక్షలు ఇస్తామని చెప్పి రూ.లక్ష మాత్రమే అకౌంట్‌లో జమ చేసింది. జూలై నుంచి డిసెంబర్ వరకు పనిచేసినప్పటికీ వేతనం చెల్లించలేదు. కేవలం నాకు రూ.30వేలు మాత్రమే ఇచ్చినట్లు అయ్యింది. జిల్లాలో కొంత మందికి మాత్రమే రిటైర్మెంట్ బెనిఫిట్ వచ్చింది. మిగతా వారికి రావాల్సి ఉంది.

– రాధ, రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్

ఖాళీల భర్తీకి చర్యలు..



జిల్లాలో 139 అంగన్‌వాడీ పోస్టులు, 552 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదివరకు 96 టీచర్ పోస్టులు, 402 ఆయా పోస్టులు ఖాళీగా ఉండగా, ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీలతో ఖాళీల సంఖ్య పెరిగింది. ఈ వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోస్టుల భర్తీకి చర్యలు చేపడతాం. అలాగే జిల్లాలో రిటైర్ అయిన 23 మంది టీచర్లకు వారి ఖాతాల్లో బెనిఫిట్ డబ్బులు జమ అయ్యాయి. మరో 27 మంది టీచర్లు, 144 మంది ఆయాలకు అందాల్సి ఉంది.

– సవితా, జిల్లా సంక్షేమ అధికారి, ఆదిలాబాద్

ట్రబుల్ ఐటీ కాదు.. ట్రిపుల్ ఐటీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క

- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- కలెక్టర్‌తో కలిసి కళాశాల సందర్శన
- తక్షణావసరాలకు రూ.కోటి మంజూరు

భైంసా: బాసర ఆర్జీయూకేటీ ట్రబుల్‌ఐటీ కాదు.. ట్రిపుల్‌ఐటీ అని నిరూపిస్తామని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. శుక్రవారం కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావుపటేల్, విఠల్‌రెడ్డితో కలిసి కళాశాలను సందర్శించారు. విద్యార్థులు మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతించారు. అనంతరం వీసీ గోవర్ధన్‌తో కలిసి విద్యార్థులతో గంటకు పైగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మంత్రికి సమస్యలు తెలిపారు. 70శాతం బాలికలున్న క్యాంపస్‌లో ఒక్క గైనకాలజిస్ట్ కూడా లేరని, వారానికి రెండు సార్లు డాక్టర్లు వచ్చిపోతారని, ల్యాప్‌టాప్‌లు పాత బడ్డాయని, యూనిఫాంలు అందలేదని, మెస్‌లలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, రెగ్యులర్ ఫ్యాకల్టీ లేక చదువులో వెనుకబడుతున్నామని, డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేదని వివరించారు. బడ్జెట్ పెంచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆర్జీయూకేటీని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. దీంతో విద్యార్థులు ఆందోళనలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. గతేడాది కలెక్టర్, ఎస్పీతో ట్రిపుల్‌ఐటీలోని పరిస్థితులు, విద్యార్థుల సమస్యలపై నివేదికలు తెప్పించుకున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ అవసరాల కోసం రూ.కోటి ఇస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, మెస్‌లను నిరంతరం పర్యవేక్షించి నాణ్యమైన భోజనం అందేలా చూడాలని వీసీకి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆర్జీయూకేటీలోని సమస్యలు పరిష్కరించాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో ట్రిపుల్‌ఐటీలో జరిగిన అవినీతి, అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.50కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేసి సమస్యలు పరిష్కరించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాసర ఆలయాభివృద్ధిపై దృష్టి

బాసర శ్రీజ్ఞానసరస్వతీ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. శుక్రవారం బాసరలో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశానికి హాజరై మాట్లాడారు. నెలక్రితమే దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆలయానికి రూ.50 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. మరోసారి సమావేశమై ఆలయ అభివృద్ధిపై చర్చిస్తామని చెప్పారు. మాస్టర్ ప్లాన్ తయారు చేసి సరస్వతీ అమ్మవారి గొప్పతనాన్ని దేశానికి చాటిచెప్పేలా ఆలయాన్ని తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.వేల కోట్ల అభివృద్ధి చేసినా జిల్లా ప్రజలు బీజేపీ అక్షింతలకే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేశారని పేర్కొన్నారు. 11ఏళ్ల క్రితమే జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు జమచేస్తామన్న బీజేపీ ప్రభుత్వం ఇప్పటికీ మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. అగర్‌బత్తీలపై జీఎస్టీ వేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. పన్నుల రూపంలో కేంద్రానికి రూ.వేల కోట్లు చెల్లిస్తున్నా ఆ స్థాయిలో రాష్ట్రానికి నిధులు రావడంలేదని విమర్శించారు. జిల్లాలో నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నా కనీసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఒక్క నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేయించలేకపోయారని ఆరోపించారు. ఎన్నడూ లేనట్లు సన్నరకాలు పండించిన రైతులకు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వంటగ్యాస్‌పై రూ.500 సబ్సిడీ కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్హులందరి పంటరుణాలు మాఫీ చేస్తామని, రైతు భరోసా తప్పకుండా వేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు.

శాస్త్రీయ తెలంగాణకు కృషిచేయాలి

- ఆదిలాబాద్‌లో నేటి నుంచి రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు
- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్



మాట్లాడుతున్న రాజేశ్వర్

ఆదిలాబాద్‌టౌన్: శాస్త్రీయ తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ఈనెల 14 నుంచి 16 వరకు ఆదిలాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 33 జిల్లాల నుంచి 132 టీమ్‌లు, 396 మంది విద్యార్థులు, 132 మంది గైడ్ టీచర్లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు రాత పరీక్ష, యాక్టివిటీ రౌండ్, క్విజ్, విజువల్ రౌండ్, క్రియేటివిటీ రౌండ్, సైన్స్ ప్రయోగాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే సైన్స్ సెమినార్లు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ఆకాశ్ దర్శనం, సైన్స్ ఎగ్జిబిషన్, మిరాకిల్ ఎక్స్‌పోజర్ తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. నవంబర్ 28న నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 12వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్రస్థాయికి సంబంధించి ప్రతి జిల్లా నుంచి నాలుగు టీమ్‌ల చొప్పున పాల్గొంటాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించడం, శాస్త్రీయ దృక్పథం అలవర్చడం, సృజనాత్మకత వెలికితీయడానికి చెకుముకి సంబరాలను 35 ఏళ్లుగా జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తుందని వివరించారు. సమావేశంలో డీఈవో ప్రణీత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకాంత్, పెంటపర్తి ఊశన్న, వీరన్న, నాయకులు లక్ష్మారెడ్డి, రాంచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- రాష్ట్ర పరిశీలకులు ప్రదీప్ కుమార్



సర్వేను పరిశీలిస్తున్న ప్రదీప్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్/ఇంద్రవెల్లి: కుష్ఠు గుర్తింపు సర్వే పకడ్బందీగా చేపట్టాలని అధికారులు, సిబ్బందిని రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ప్రదీప్‌కుమార్ ఆదేశించారు. పట్టణంలోని హమాలీవాడ అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం పరిశీలించారు. ఆశ కార్యకర్తలు నిర్వహిస్తున్న సర్వే పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ ఒక్కరు కూడా తప్పిపోకుండా సర్వే చేపట్టాలని సూచించారు. కుష్ఠు రహిత దేశంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. జిల్లాలో 1లక్ష 76వేల 426 ఇళ్లు ఉండగా, ఇప్పటివరకు 1లక్ష 54వేల 25 ఇళ్ల సర్వే పూర్తయినట్లు తెలిపారు. 6లక్షల 39వేల 106 మందికి పరీక్షలు నిర్వహించగా, 800మందిని అనుమానితులుగా గుర్తించినట్లు చెప్పారు. మరో రెండు రోజుల సమయం ఉందని, సర్వే వందశాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఆయన వెంట జిల్లా కుష్ఠు నివారణ అధికారి గజానంద్, డీపీఎంవో వామన్‌రావు తదితరులున్నారు. అలాగే ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని బుద్ధనగర్, ప్రబుద్ధనగర్ కాలనీలో చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి శ్రీకాంత్, డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్‌రావ్, తదితరులున్నారు.

క్లుప్తంగా

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి


ఖోఖో పోటీలు ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

తలమడుగు: ఈ ప్రాంత క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఖోడద్ జెడ్పీ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం కప్ పేరిట పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రామగుండం ఏఎస్పీ నర్సింహులు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యంతో క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తులను బోరంచు శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాకే ఆనంద్, ట్రైబల్ వెల్ఫేర్ క్రీడా అధికారి పార్థసారథి, బీఆర్ఎస్ బోథ్ అధికార ప్రతినిధి కిరణ్, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ రాష్ట్రపాల్, గ్రామ యూత్ ప్రెసిడెంట్ శివకుమార్, వెంకట్ రెడ్డి, దేవదాస్ క్రీడ ఉపాధ్యాయులు కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

బెల్లంపల్లి: రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా ఓమినీ వ్యాన్‌లో తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుభాష్‌నగర్‌బస్తీకి చెందిన ఎండీ జమీల్ అనే వ్యక్తి ప్రజల వద్ద నుంచి 4.9 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి ఓమినీ వ్యాన్‌లో తీసుకెళ్తున్నాడు. సుభాష్‌నగర్‌బస్తీలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఓమినీ వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు జమీల్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తిర్పెల్లిలో వరిధాన్యం దొంగతనం

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లిలో వరిధాన్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. మండలంలోని తిర్పెల్లి గ్రామానికి చెందిన ఖైర గంగాధర్ అనే రైతు గ్రామ సమీపంలోని రోడ్డుపై తినడానికి అవసరమైన వరిధాన్యం ఆరబెట్టారు. గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆర బెట్టిన వరి ధాన్యం నుంచి 70 కేజీల నాలుగు బస్తాలు ఎత్తుకెళ్లారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు గంగాధర్ తెలిపారు.

బ్యాంక్ చోరీకి విఫలయత్నం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని రామాయి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో చోరీకి విఫలయత్నం జరిగింది. బ్యాంక్ గోడకు కన్నం (రంధ్రం) వేసి బ్యాంక్ లోనికి దొంగలు ప్రయత్నించారు. వెంటనే బ్యాంక్ సైరన్ మోగడంతో దొంగలు పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వెనుకాల ఉన్న చేనులో నుంచి దొంగలు వచ్చినట్లు గుర్తించారు. దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ!

- ప్రజలను బురిడీ కొట్టిస్తున్న సైబర్ నేరగాళ్లు
- ఏపీకే ఫైళ్లు పంపి మోసాలు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- తెలియని లింక్‌ల జోలికి వెళ్లొద్దని హెచ్చరిక



నిర్మల్‌టౌన్: ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం బాగా పెరిగింది. డిజిటల్ లావాదేవీలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో సైబర్ మోసాలు జోరుగా సాగుతున్నాయి. పండుగల వేళ సైబర్ నేరస్తులు కొత్త ప్రయత్నాలు చేస్తున్నారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామంటూ క్షణాల్లో బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బు మాయం చేస్తున్నారు. ఇలాంటి మోసాలపై జాగ్రత్తగా ఉండాలని పోలీసులు పదే పదే సూచిస్తున్నా బాధితులు పెరుగుతూనే ఉన్నారు. అందరిని బురిడీ కొట్టించేలా ఫోన్ కాల్స్ చేయడం.. లాటరీ తగిలిందనో, తక్కువ ధరలో బ్రాండెడ్ వస్తువులు లభ్యమవుతున్నాయనో, ఏదో ఒక మెసేజ్ పంపి నకిలీ లింకులు చేరవేస్తూ.. ఆకర్షితులైన వారి ఖాతా నుంచి డబ్బులు కాజేస్తున్నారు.

పండుగల వేళ సైబర్ దోపిడీ..

పండుగలు వచ్చాయంటే చాలు.. సైబర్ నేరగాళ్లు ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నంలో ఉంటున్నారు. రానున్న క్రిస్మస్ పండుగ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. క్రిస్మస్ గ్రీటింగ్స్, మెసేజ్‌ల పేరిట సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడనున్నట్లు పోలీసులు హెచ్చరిస్తున్నారు. క్రిస్మస్ గిఫ్ట్ అంటూ.. వాట్సప్ గ్రూపుల్లో వచ్చే సందేశాలను పట్టించుకోవద్దని, అత్యాశతో లింకుపై క్లిక్ చేస్తే ఫోన్‌లో ఉన్న వ్యక్తిగత డేటా చోరీ చేస్తారని పోలీసులు చెబుతున్నారు. క్రిస్మస్ శుభాకాంక్షలు పేరిట వచ్చే లింక్‌లపై క్లిక్ చేసి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచిస్తున్నారు.

ఏపీకే ఫైళ్లతో ప్రమాదం..

సైబర్ నేరగాళ్లు ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ లేదా ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే) ఫైళ్లను వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. వాటిని ఓపెన్ చేసి ఒకే అని క్లిక్ చేస్తే.. సంబంధిత వ్యక్తుల ఫోన్లు హ్యాకవుతున్నాయి. ఫలితంగా ఫోన్ నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తుంది. ఫోన్ హ్యాక్ అయ్యిందని తెలియని వారు డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా సొమ్ము పంపితే వెంటనే హ్యాక్ చేసి, మొబైల్ నంబర్ ద్వారా పిన్ నంబర్ తెలుసుకుని నిమిషాల్లో సదరు వ్యక్తి బ్యాంకు ఖాతాలోని నగదు కాజేస్తున్నారు. హ్యాక్ చేసిన మొబైల్ డివైస్ డిస్‌ప్లే సైబర్ నేరగాళ్ల చేతిలో ఉంటుంది. దీని ప్రకారం ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్ నంబర్లకు ఫోన్ హ్యాకింగ్‌కు గురైన వ్యక్తి పంపినట్లు ఏపీకే ఫైళ్లు పంపుతున్నారు. ఏపీకే ఫైళ్ల లింక్ ఓపెన్ చేసిన వారు బ్యాంకు ఖాతాలో సొమ్ము కోల్పోతున్నారు. కొందరు నేరగాళ్లు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ యోజన పథకం పేరిట లింక్ పంపుతున్నారు. ఈ లింక్‌ను ఓపెన్ చేసిన కూడా ఫోన్ హ్యాక్‌కు గురై బాధితుల బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బులు కాజేస్తున్నారు. సోషల్ మీడియాలో వచ్చే అనవసర లింక్‌లను ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దని పోలీసులు సూచిస్తున్నారు.

జిల్లాలో సైబర్ నేరాలు..

నిర్మల్ జిల్లాలో 2022లో 41 సైబర్ నేరాలు జరగ్గా, 2023లో 17 జరిగాయి. 1 జనవరి 2024 నుంచి ఇప్పటివరకు మొత్తం 666 ఫిర్యాదులు రాగా.. 38 కేసులు నమోదయ్యాయి. పుట్ ఆన్ హోల్డ్ అయిన రూ.8,73,108ను పోలీసులు రికవరీ చేశారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, వివిధ పబ్లిక్ స్థలాలలో సైబర్ నేరాలపై మొత్తం 716 అవగాహన సదస్సులు నిర్వహించారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



సైబర్ నేరగాళ్లు పండుగలు వచ్చాయంటే దోపిడీ చేయడానికి కొత్త ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయంలో ప్రజలు జాగ్రత్త వహించాలి. సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ పథకాల పేరుతో లింక్‌లు పంపుతున్నారు. వాటిని ఓపెన్ చేస్తే సైబర్ నేరగాళ్ల మాయలో చిక్కినట్లే. ఎవరైనా సైబర్ మోసానికి గురైనా, ఫోన్ హ్యాక్‌కు గురై బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు పోగొట్టుకున్నా వెంటనే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930కు లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– జానకీ షర్మిల, ఎస్పీ, నిర్మల్

అమ్మకు.. ఊయలే ఉరితాడై..


నీరజ (ఫైల్)

బెల్లంపల్లి: తన ముగ్గురు సంతానంలో చిన్న కూతురును ఆడించేందుకు ఆ తల్లి ఇంట్లోనే చీరతో ఊయల కట్టింది. ప్రతీరోజు చిన్నారిని తన ఒడిలో కూర్చోబెట్టుకుని ఊయల ఊగుతూ చిన్నారిని ఆడించింది. కానీ ఆ తల్లికి అప్పుడు తెలియలేదు తన పిల్లలను ఆడించే ఆ ఊయలే తన పాలిట యమపాశమవుతుందని. అనూహ్యంగా ఊయల కోసం కట్టిన చీర తన మెడకు చుట్టుకుని ఆ తల్లి ఆ చిన్నారుల నవ్వులకు శాశ్వతంగా దూరమైంది. వివరాల్లోకి వెళ్తే.. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి బెల్లంపల్లి బస్తీకి చెందిన పోచంపల్లి నీరజ(42)కు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె నవ్యశ్రీ, కుమారుడు ధనుశ్, చిన్న కూతురు 19 నెలల చిన్నారి సుచిత్ర ఉన్నారు. తన చిన్న కూతురు కోసం ఇంట్లో చీరతో ఊయల కట్టారు. గురువారం కొంచెం సేపు చిన్న కూతురు సుచిత్రతో కలిసి ఊయల ఊగింది. అనంతరం సుచిత్రను తన ఒడిలో నుంచి కిందకు దింపి కుమారుడు ధనుశ్‌కు ఊయల ఊగడం చూపిస్తూ ఒక్కసారిగా గుండ్రంగా తిరిగింది. నీరజ మెడకు ఆకస్మికంగా చీర చుట్టుకుని మెడకు గట్టిగా బిగుసుకుపోయింది. అది తెలియని చిన్నారులు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు. అంతలోనే ఇంట్లో నుంచి బయటకు వచ్చిన అత్త చూసే సరికి నీరజ మెడకు చీర ఉరిపడి ఆమె మృతిచెంది ఉంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘అప్రమత్తంగా ఉండి సేవలు అందించాలి’

ఉట్నూర్‌రూరల్: 108, 102 సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ అన్నారు. శుక్రవారం మండలంలోని జీవీకే ఈఎంఆర్ఐ 108 డివిజన్ కార్యాలయాన్ని 108, 102 అంబులెన్స్ వాహనాలను తనిఖీ చేసి రికార్డులు, వాహనాల నిర్వహణ, వైద్య పరికరాల పనితీరు పరిశీలించారు. వాటి ఉపయోగాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతీ కేసు వచ్చిన వెంటనే సిబ్బంది త్వరితగతిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు వైద్య సహాయం అందించాలని, గిరిజన ప్రాంతాల్లో మండల ప్రజలకు అందుబాటులో ఉండి మంచి నాణ్యమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రాజశేఖర్, 108, 102 సిబ్బంది శంకర్, దత్తు, నాందేవ్, ప్రవీణ్, రవీందర్, నాగమణి, రాజశేఖర్, ధరంసింగ్, ప్రవీణ్, అంజన్న, వెంకటేశ్ ఉన్నారు.

‘గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి’


పీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న భాషా పండితులను అప్‌గ్రేడ్ చేయాలని టీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేశ్ మాట్లాడుతూ.. సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని, సీఆర్టీల వేతనాలను వెంటనే విడుదల చేయాలని, గిరిజన ప్రాంతాల్లో ఏజెన్సీ డీవో పోస్టులను భర్తీ చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో ఏజెన్సీ డీఎస్సీని, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. టీటీఎఫ్ సంఘానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు క్రమబద్ధీకరించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేశ్, జిల్లా అధ్యక్షుడు రవీందర్, జిల్లా, మండల బాధ్యులు రామారావు, పవన్‌లాల్, రాథోడ్ దేవిదాస్, ఈశ్వర్, విఠల్, షేర్‌సింగ్, రవీందర్, వికాస్ తదితరులు ఉన్నారు.

భార్యను హత్యచేసిన భర్తకు జీవితఖైదు

ఆదిలాబాద్‌టౌన్: భార్యకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో హత్య చేసిన కేసులో భర్తకు జీవితఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి ప్రభాకరావు తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2022 జూలై 31న రాత్రి 9 గంటల ప్రాంతంలో యాపల్‌గూడకు చెందిన అలిబెట్టి విష్ణు భార్య కవితను తీసుకొని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లో ఆదిలాబాద్‌కు వచ్చాడు. ఆగస్టు 1న ఉదయం 8 గంటల ప్రాంతంలో బస్సులో గిమ్మ క్రాస్‌రోడ్డు వద్ద దిగి రాంపూర్ శివారులో భార్యను బండరాయితో తలపై కొట్టాడు. అనంతరం నైట్ ప్యాంట్ నాడాను ఆమె మెడకు బిగించి చెట్టుకు కట్టేశాడు. ఆమె ఊపిరాడక మృతిచెందింది. ఆ తర్వాత పోలీసుస్టేషన్‌కు వెళ్లి సరెండర్ అయ్యాడు. అప్పటి జైనథ్ ఎస్సై పెర్సిస్ కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా పీపీ మధుకర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు జడ్జి తీర్పు వెల్లడించినట్లు వివరించారు.

నేరడిగొండలో..

భార్యపై అనుమానంతో హత్య చేసిన భర్తకు జీవితఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కె.ప్రభాకర రావు తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలం దేవుల్‌నాయక్ తండాకు చెందిన బిడ్వార్ రాజుకు భూతాయి గ్రామానికి చెందిన జమునతో 2014లో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యపై తరచూ అనుమానంతో వేధింపులకు పాల్పడేవాడు. 2021 జూన్ 30న ఉదయం 4 గంటల సమయంలో గడ్డపారతో కొట్టగా ఆమె తీవ్ర గాయాలపాలై మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయగా అప్పటి నేరడిగొండ ఎస్సై భరత్‌సుమన్ కేసు నమోదు చేశారు. పీపీ మధుకర్ 16 మంది సాక్ష్యులను విచారించి నేరం రుజువు చేయగా, జడ్జి తీర్పు వెల్లడించినట్లు లైజన్ అధికారి వివరించారు.

పిచ్చికుక్క స్వైరవిహారం


పిచ్చికుక్క దాడిలో గాయపడిన గర్భిణి

మేమనపల్లి: మండల కేంద్రంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలోని రోడ్డుపై ఉన్న కొండ రమ్య అనే 9 నెలల గర్భిణీని తీవ్రంగా గాయపర్చింది. అదే విధంగా సుమలత, ఎల్లెల పోశక్కల కాళ్లు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోని మరో ఐదుగురిపై దాడికి పాల్పడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. బాధితులను స్థానిక పీహెచ్‌సీలో ఆర్ఎస్‌వీ టీకా తీసుకుని మెరుగైన వైద్యం కోసం చెన్నూర్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలోని రెండు కుక్కలు మూడు రోజులుగా మనుషులు, పశువులపై దాడులకు తెగబడుతున్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది మేల్కొని గామంలో పిచ్చికుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగు.. లాభాలు బాగు

- చేతికొచ్చిన పంట
- టన్నుకు రూ.20,430
- జిల్లాలో చెన్నూర్ నియోజకవర్గం టాప్


రాపన్‌పల్లిలోని రైతు చేనులో ఆయిల్‌పామ్ గెలలు

చెన్నూర్: జిల్లాలో సాగవుతున్న కొత్త పంట లాభాలు తెచ్చిపెడుతోంది. మంచిర్యాల జిల్లాలో 869 మంది రైతులు 3092 ఎకరాలలో ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్నారు. గత ఏడాది నుంచి ఆయిల్‌పామ్ పంట చేతికొస్తుంది. ఈ ఏడాది ఆయిల్‌పామ్ గెలలు టన్ను ధర రూ. 20,430 పలుకుతుంది. దీంతో రైతులు లాభాల బాట పడుతున్నారు. జిల్లాలో చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్, కోటపల్లి, జైపూర్, భీమారం మండలాలలో ఆయిల్‌పామ్ తోటలను ముందుగా సాగు చేశారు. పంట దిగుబడి సైతం ముందుగా రావడంతో రైతులు పంట లాభాలు అర్జిస్తున్నారు. గత ఏడాది టన్నుకు రూ.17,114 ఉండగా ఈ ఏడాది ధర అమాంతం రూ.3000లకు పైగా పెరిగింది. దీంతో రైతులు పంట ద్వారా లాభాలు పొందుతున్నారు.

విదేశీ మార్కెట్‌లో పెరుగుతున్న ధరలు..

ఆయిల్‌పామ్ ధర విదేశీ మార్కెట్‌లో పెరగడంతో ఈ ఏడాది టన్నుకు రూ. 20,430 పలుకుతుంది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. 2022 కరోనా సమయంలో పంట దిగుబడి తక్కువ ఉండడంతో రికార్డు స్థాయిలో ఆయిల్‌పామ్ టన్నుకు రూ.23 వేలు పలికింది. ఈ ఏడాది సైతం టన్నుకు సుమారు రూ. 22 వేలకు పైగా పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

అంతర పంటల సాగు..

ఆయిల్‌పామ్ మొక్కలను ఎకరానికి 57 మాత్రమే నాటడంతో మొక్కమొక్కకు మధ్య మూడు మీటర్లకు పైగా దూరం ఉంటుంది. దీంతో రైతులు ఇటు ఆయిల్‌పామ్‌తో పాటు కూరగాయలు, పత్తి, బబ్బెర సాగు చేస్తున్నారు. ఆయిల్‌పామ్ పంట చేతికొచ్చే వరకు రైతులు అంతర్‌పంట ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారు.

ఎకరానికి రూ.4200 సబ్సిడీ..

ఆయిల్‌పామ్ పంటకు ప్రభుత్వం ఎకరానికి రూ. 4200 చెల్లిస్తుంది. ఇందులో రూ. 2100 ఎరువులు, మందుల కోసం కాగా రూ. 2100 అంతర్ పంట సాగు కోసం ప్రభుత్వం సబ్సిడీ కింద మంజూరు చేస్తుంది. దీంతో రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రానున్న రోజుల్లో జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు రెండింతలయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మ్యాట్రిక్స్ కంపెనీ ఆధ్వర్యంలో..

రైతులు పండించిన పంటను మ్యాట్రిక్స్ ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేస్తున్నారు. ఈ కంపెనీ ఆధ్వర్యంలో భీమారం మండల కేంద్రంలో ఆయిల్‌పామ్ మొక్కల నర్సరీని ఏర్పాటు చేశారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నారు. 2025లో జిల్లాలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు మ్యాట్రిక్స్ కంపెనీ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు.

100 టన్నుల దిగుబడి వస్తుంది..



నేను 10 ఎకరాలలో ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్న. ఎకరానికి 10 టన్నుల దిగుబడి వస్తుంది. 10 ఎకరాలకు 100 టన్నులకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది టన్ను ధర పెరిగింది. అంతర్ పంట సైతం సాగు చేస్తున్న. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభమే.

– వెన్నపురెడ్డి బాపురెడ్డి, చెన్నూర్

తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ


తెరిచి ఉన్న బీరువా

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన ఇట్టెం గణేశ్ కొద్ది రోజుల కిందట దుబాయ్ వెళ్లాడు. అతని భార్య స్వప్న ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. రాత్రి సమయంలో పక్కనే ఉన్న తమ బంధువుల ఇంటికి నిద్రించేందుకు వెళ్తున్నారు. ఈక్రమంలో గురువారం రాత్రి బంధువుల ఇంటికి నిద్రించేందుకు వెళ్లిన స్వప్న శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగానే తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం తెరిచి అందులోని రూ.20 వేలు చోరీ చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై సుమలత సంఘటన స్థలానికి చేరుకుని జాగిలంతో ఇంటిని పరిశీలించారు. స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం రాత్రి దొంగతనం జరిగినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కాసిపేట మండలం సోమగూడెంకు చెందిన కోదాటి పద్మ బంధువుల పెళ్లికి కరీంనగర్ వెళ్లేందుకు ఆటోలో బస్టాండ్‌కు వచ్చింది. కొంత సమయం తర్వాత బస్సు రాగానే ఎక్కి బ్యాగును పరిశీలించగా జిప్ ఓపెన్ చేసి ఉంది. గమనించిన ఆమె అనుమానంతో బ్యాగును తనిఖీ చేయగా అందులోని రూ.1లక్ష 40వేల విలువ గల 7 తులాల బంగారం, రూ.1500 విలువ గల వెండి పట్టీలు కన్పించకపోవడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చోరీకి పాల్పడ్డ నిందితుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని జైజవాన్‌నగర్‌లోని ఓ ఇంట్లో ఈనెల 8న రాత్రి సమయంలో చోరీ జరిగింది. రూ.15వేల నగదుతో పాటు సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడిన క్రాంతినగర్‌కు చెందిన షేక్ అయాన్‌ను టూటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఐడీ పార్టీ పోలీసులు నరేశ్, క్రాంతి, సుధాకర్ రెడ్డి, నరేందర్, శ్రీకాంత్, గోపాల్ పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అనుమానంగా వ్యక్తి తిరగడంతో విచారించారు. దీంతో నిందితుడు షేక్ అయాన్ దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. కాగా అతనిపై ఇప్పటికే ఎనిమిది పాత కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుడి నుంచి రూ.5వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

కాపర్‌వైర్ దొంగల పట్టివేత

రెబ్బెన/ తాండూర్: సింగరేణి సంస్థకు చెందిన కాపర్ కేబుల్ నుంచి కాపర్ వైరు చోరీకి పాల్పడి తరలిస్తున్న దొంగలను శుక్రవారం సింగరేణి ఎస్అండ్‌పీసీ సిబ్బంది తాండూర్‌లో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్ ఆధ్వర్యంలో ఎస్అండ్‌పీసీ సిబ్బంది తాండూర్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు కాపర్ వైరును అక్రమంగా తరలిస్తుండగా గమనించిన సిబ్బంది పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. తాండూర్‌లోని ఓ స్క్రాప్ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా సింగరేణికి చెందిన మూడు కిటికీలు, డోజర్‌కు సంబంధించిన విభాగాలు లభ్యం కాగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అక్రమంగా సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటున్న వారికి నోటీసులు అందజేశారు. తనిఖీల్లో ఎస్అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, జమేదార్ శంకర్, తపన్ మండల్, గొర్ల శ్రీనివాస్, శ్రీనివాస్, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి


భీమేశ్ మృతదేహం

నెన్నెల: మండలంలోని నందులపల్లికి చెందిన పాకాల భీమేశ్ (58) శుక్రవారం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం భీమేశ్ కొంత కాలంగా మతిస్థిమితం లేకపోవడంతో రోజంతా ఊళ్లో తిరిగి రాత్రి ఇంటికి వచ్చేవాడు. ఈనెల 11న తెల్లవారుజామున వెళ్లిన భీమేశ్ రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో కుమారుడు శ్రావణ్ తండ్రి భీమేశ్ కోసం చాలా చోట్ల వెతికినా ఎక్కడా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం నందులపల్లి శివారులోని చెరువులో భీమేశ్ మృతదేహాన్ని చూసిన అదే గ్రామానికి చెందిన సాయికుమార్ శ్రావణ్‌కు విషయం తెలిపాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడని కుమారుడు శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌లు ఢీ.. బాలిక మృతి


విపాసన మృతదేహం

ఆసిఫాబాద్‌రూరల్: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని బాలిక మృతి చెందిన సంఘటన మండలంలోని సాలేగూడ వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జన్కాపూర్‌కు చెందిన మహేశ్ తన అక్క కూతురు విపాసన (8)తో కలిసి ఇప్పల్ నవేగాంలోని తన చేనుకు వెళ్లి వస్తుండగా సాలెగూడకు చెందిన విజయ్ ఆసిఫాబాద్ నుంచి సాలేగూడకు వెళ్తున్న క్రమంలో ఎదురెదురుగా వారి బైక్‌లు ఢీ కొన్నాయి. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాలకు తరలించే క్రమంలో విపాసన మృతిచెందగా మిగితా ఇద్దరు మంచిర్యాలలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో మహేశ్‌కు తలకు, విజయ్‌కు భుజంపై తీవ్ర గాయాలయ్యాయి. విపాసనకు కడుపులో ఎముకల విరిగి శ్వాసకు ఇబ్బందైనట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

- క్షతగాత్రులను చూసి కాన్వాయ్ ఆపిన మంత్రి సీతక్క


క్షతగాత్రులను తరలించేందుకు కాన్వాయ్ దిగిన మంత్రి సీతక్క

దిలావర్‌పూర్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ వైపు నుంచి చాక్‌పల్లి గ్రామానికి బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వెళ్తుండగా న్యూలోలం గ్రామ సమీపంలో పంట చేలనుంచి జాతీయరహదారి వైపునకు బాలుడిని తీసుకుని వస్తున్న ఇద్దరు రైతులు బైక్‌తో బలంగా ఢీకొన్నారు. దీంతో చాక్‌పల్లి గ్రామానికి వెళ్తున్న విఠల్ అనే వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగితా వారికి స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో జిల్లా పర్యటనలో భాగంగా బాసర నుంచి నిర్మల్ వైపునకు వస్తున్న మంత్రి సీతక్క క్షతగాత్రులను చూసి కాన్వాయ్ దిగి వారిని 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించేవరకు అక్కడే ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.